క్లుప్తంగా

ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద శనివారం ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం చేసుకునే విధంగా ఆర్జిత సేవగా మార్పు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించి, అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తాగునీటి సమస్య



మరమ్మతులకు గురైన ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని రోగులు, వారి బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆస్పత్రిని కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతూనే ఉన్నారు. అయితే మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నారు. అందుకు నిదర్శనం ఆస్పత్రిలోని ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురై నాలుగు నెలలు కావస్తోంది. దీంతో రోగులు, వారితో వచ్చిన వారు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, స్పందించి కనీసం స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని రోగులు కోరుతున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి రూరల్: భారత ప్రధాని నరేంద్ర మోదీ 74వ జన్మదిన వేడుకల్లో భాగంగా 5వ రోజున శనివారం శ్రీకాళహస్తి మండలం ముచ్చి వోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ కృషి, పట్టుదల, దూరదృష్టి ద్వారా దేశప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ పార్టీ కోకన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, మండల అధ్యక్షుడు కూనాటి నాగరాజు, ప్రముఖ న్యాయవాది చలమయ్య, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న జోసెఫ్

ఏర్పేడు: కుటుంబ పోషణకు టైలరింగ్ వృత్తి ఎంతో దోహద పడుతుందని షేర్ జీసెస్ వర్ల్ మినిస్ట్రీస్ సంస్థ అధ్యక్షుడు జోసెఫ్ అన్నారు. శనివారం మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 15 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లతో పాటు కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మేరీ, ఈశ్వర్‌రెడ్డి, వెంకటరత్నం, మహిళలు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు అండ



దత్తత తీసుకున్న దంపతులకు నిత్యావసర సరుకులను అందిస్తున్న లోకేశ్వరిరెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో లోకేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత లోకేశ్వరి రెడ్డి శనివారం ఇద్దరు వృద్ధ దంపతులను దత్తత తీసుకున్నారు. నిరుపేద వృద్ధ దంపతులు కోటేశ్వరి, బాషా వయసు మీద పడి కంటి చూపు సరిగా కనబడక పూట గడవడమే కష్టమైంది. ఇరుగు పొరుగు వారు అన్నం పెడితే అది తిని కాలం వెళ్లదీస్తున్న విషయం లోకేశ్వరిరెడ్డి తెలుసుకున్నారు. శనివారం ఉదయం వారి ఇంటికి వెళ్లి బియ్యం బస్తా, నిత్యావసర సరుకులను అందజేశారు. వారిని దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకుంటానని భరోసా ఇచ్చారు. దీంతో వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

వందరోజులు

బాబూ.. ఏమయ్యాయి హామీలు?

"సత్యవేడులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేస్తాం.. అలాగే సత్యవేడు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తాం.. అంతేకాకుండా సత్యవేడు, దాసుకుప్పం ప్రాంతాల్లో బైపాస్ రోడ్డు నిర్మిస్తాం.. అలాగే ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న సత్యవేడు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలకు సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల స్థాయి ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం.. నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేస్తాం'' ఇవీ ఎన్నికల ప్రచార సమయంలో ఈ ఏడాది ఏప్రిల్ 20న సత్యవేడు గాంధీ బొమ్మ కూడలిలో జరిగిన రోడ్‌షోలో ముఖ్యమంత్రి అభ్యర్థి హోదాలో చంద్రబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి హోదాలో కోనేటి ఆదిమూలం ఇచ్చిన హామీలు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తవుతున్నా సూపర్‌సిక్స్ హామీలతో పాటు నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు అమలు గాలికొదిలేశారు. హామీలు అమలు చేయమంటే చంద్రబాబు డొంక తిరుగుడు రాజకీయాలు మొదలు పెట్టారు.



గుంతలమయంగా కదూరు కూడలి–సత్యవేడు ప్రధాన రోడ్డు

- ఎన్నికల హామీల అమలుపై చంద్రబాబు డొంక తిరుగుడు రాజకీయాలు
- వంద రోజులు పూర్తయినా నేటికీ అమలుకు నోచుకోని సూపర్‌సిక్స్ పథకాలు
- సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు అంతేనా..!
- నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలు



అధ్వానంగా నాగలాపురం–టీపీకోట రోడ్డు మార్గం

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయింది. అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదే అంటూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు హామీలు ఇచ్చి నియోజకవర్గ ప్రజలను ఊరడించారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మిన నియోజకవర్గ ప్రజలు స్థానిక టీడీపీ ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన ఆదిమూలంను గెలిపించారు. ఎమ్మెల్యే సైతం నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పలు హామీలు ఇచ్చినప్పటికీ ఒకటి కూడా ఆచరణ కాలేదు. కానీ ఇంతవరకు సూపర్‌సిక్స్ హామీలు పూర్తిస్థాయిలో ఎప్పుడు అమలు చేస్తారా ? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. దీనికితోడు సత్యవేడు ప్రజలకు అలివికానీ హామీలిచ్చి, అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తయినా అటు సీఎం చంద్రబాబు, ఇటు స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం ముఖం చాటేస్తున్నారు.

నెరవేర్చాల్సిన హామీలివే సీఎం సారూ..!

- నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి.
- సత్యవేడులో ఇరుకు రోడ్ల నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు బైపాస్ రోడ్డు నిర్మించాలి.
- గత ప్రభుత్వంలో మంజూరైన సత్యవేడు, నాగలాపురం మండలాల పరిధిలోని దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి
- సత్యవేడు ప్రజల తాగునీటి అవసరాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేయాలి.
- గత ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని చేసిన చట్టాన్ని కొనసాగిస్తూ, అదే చట్టాన్ని శ్రీసిటీ పరిశ్రమల్లో అమలు చేయాలి.
- డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
- తెలుగుగంగ ఉపకాలువలకు ఆధునీకరణ పనులు చేపట్టాలి.
- అరణియార్ ప్రాజెక్ట్ ఆధునికీకరణకు గత ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.
- నాగలాపురం–టీపీకోటకు వెళ్లే రోడ్డు, బీఎన్‌కండ్రిగ–సూళ్లూరుపేట రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలి.
- నాడు–నేడు పథకంలో ఆగిపోయిన ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి పనులను కొనసాగించాలి.
- నియోజకవర్గంలోని 7 మండలాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ఈఏపీ ద్వారా 36 రోడ్లు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. అందులో 12 రోడ్ల పూర్తి కాగా, మరో 24 రోడ్లు పూర్తి కావాల్సి ఉంది.
- సత్యవేడు–కదూరు కూడలి, సత్యవేడు–ఊత్తుకోట ప్రధాన రోడ్డు మార్గాలు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రెండు రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉంది.

వ్యాధి నిరోధక టీకాలతో రోగాలు దూరం



చిన్నపిల్లలకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేయడం వల్ల రోగాలు రావని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వెస్టువరత్తూరు గ్రామంలో ఆయన గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణీ కాన్పు సమయంలో ధనుర్వాతం జబ్బు బారిన పడకుండా రెండు రకాల టీకాలను వేయించుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే పోలియో చుక్కల మందు, పసరికలు రాకుండా హెపటైటిస్ బీ టీకా, క్షయ రాకుండా బీసీజీ టీకా, విటమిన్ కే టీకాలను వేయడం జరుగుతుందన్నారు. బిడ్డకు 42 రోజులకు పోలియో సోకకుండా పోలియో సూది మందు, విరేచనాలు కాకుండా రోటా చుక్కలు, ఫ్లూ జ్వరాలు సోకకుండా టీకాలు, మీజిల్స్, రుబెలా, అమ్మవారు, విటమిన్–ఎ, శ్వాసకోశ జబ్బులు రాకుండా టీకాలను వేస్తున్నట్టు తెలిపారు. పిల్లలకు 12 రకాల జబ్బులు రాకుండా టీకాలు వేయడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచకపోతే చర్యలు



ఉపాధిహామీ కూలీలు, సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ భానుప్రియ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనుల కూలీల సంఖ్యను పెంచాలని పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన వీఎస్‌పురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2 వేల మంది కూలీలు పని చేయవలసి ఉండగా 1200 మంది మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచకపోతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలీ వస్తుందని, ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వారి నుంచి ఈ నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. పనుల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ భానుప్రియ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో ఉపాధి హామీ పనులు చేపట్టే చోట కూలీలకు ఎండ వేడిమి తట్టుకునేలా నీరు, నీడ, సౌకర్యాలతో పాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఏపీడీ భానుప్రియ ఆదేశించారు. ఆమె శనివారం కుక్కంబాకం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలి వస్తుందని, రోజుకు 2 వేల మంది పనిచేయాలని, టార్గెట్ ప్రకారం కూలీల సంఖ్య తగ్గకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంటుకట్టుపై అవగాహన



అంటుకట్టిన వంగనారును రైతులకు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతులకు అంటుకట్టిన వంగ సాగుపై అవగాహన జరిగింది. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పద్ధతిని పాటించి నాణ్యమైన కూరగాయల పంట దిగబడులను పొందవచ్చని తెలిపారు. అధిక వర్షాలు పడే ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో అంటుకట్టిన వంగ సాగు చేసినట్లయితే ఒకటిన్నర సంవత్సరానికి అధిక పంట దిగుబడిని పొందవచ్చని సూచించారు. అంటుకట్టిన వంగ సాగుపై క్షేత్ర ప్రదర్శనలు కోసం కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అందించిన అంటుకట్టిన వంగ నారు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సమావేశం వాయిదా

సత్యవేడు: మండలకేంద్రంసత్యవేడులో ఈ నెల 23న నిర్వహించాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యుల సమావేశం వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి సీఈఓ శరత్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ సమావేశం జరుగుతుందన్నారు. వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యులు తేదీ మార్పును గుర్తించాలని ఆయన కోరారు.

కళత్తూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

వరదయ్యపాళెం: మండలంలోని కళత్తూరు గ్రామ పంచాయతీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ టి.బాలయ్యను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు మండల ఏపీఓ గణేష్ తెలిపారు. అక్రమాలకు పాల్పడ్డారంటూ బాలయ్యపై అదే గ్రామానికి చెందిన నాగరాజు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సస్పెండ్ చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలకు సంబంధించి 10 రోజుల్లోపు బాలయ్య పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నట్లు ఏపీఓ తెలిపారు.

మత్తుతో జీవితాలు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏర్పేడు సీఐ జయచంద్ర



బీఎన్‌కండ్రిగ: మాట్లాడుతున్న ఎస్‌ఐ విశ్వనాథనాయుడు

ఏర్పేడు: మత్తుకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని ఏర్పేడు సీఐ జయచంద్ర అన్నారు. శనివారం మండలంలోని పాపానాయుడుపేట హైస్కూల్‌లో విద్యార్థులకు మత్తుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలను అలవాటు చేసుకోరాదని సూచించారు. యువకులు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను విక్రయించి వాడుతున్నట్లు సమాచారం ఉన్నట్లు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలన్నారు. చిన్నపిల్లలు, మహిళలపై అత్యాచారాలు, సైబర్ నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత ముందుకు రావాలని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు పిలుపునిచ్చారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని, మత్తు పదార్థాలను వాడడం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువత మత్తుకు బానిసైతే జీవితాలతో పాటు కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. డ్రగ్స్ వాడినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థినులు మాయమాటలు నమ్మి మోసపోకూడదని, సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలపై జాగ్రత వహించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి





ఊంజల్‌సేవలో కల్యాణ వెంకన్న, స్వామివారి దర్శనం కోసం భారీగా విచ్చేసిన భక్తులు

నారాయణవనం: తమిళ పెరటాశి తొలి శనివారం కావడంతో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. తొలిగంట నైవేద్య సమర్పణ అనంతరం 8.45 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. పెరటాసి నెలలో శనివారం నాడు వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున వస్తారు. ధ్వజస్తంభం వద్ద పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అధిష్టింపజేసి, సుగంధ పుష్ప మాలికలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఊంజల్ మండపంలో వేద, గాత్ర, నాద కచేరీల మధ్య అర్చకులు ఊంజల్ సేవ నిర్వహించారు. ఆస్థానం, రాత్రి గంట అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పెరటాశి నెల కావడంతో ఆలయ ఆవరణలో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.



బీఎన్‌కండ్రిగ: వేంకటేశ్వరస్వామికి పూజలు

ఆలయాన్ని దర్శించుకున్న భక్తులకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బుచ్చినాయుడు కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట, కారణి, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పెరటాశి నెలలో మొదటి శనివారం కావడంతో భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామివారి మూల్‌విరాట్‌కు అభిషేకాలు చేపట్టి, ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులకు ఉంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు వేసిన పండరీభజన ఆకట్టుకుంది.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శ్రీకాళహస్తి: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ పట్టణాధ్యక్షుడు చుట్టు గురవయ్య మాట్లాడుతూ పట్టణంలో నడుపుతున్న పలు ప్రైవేటు స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆదివారాలు కూడా తరగతులు నిర్వహించి విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. ప్రైవేటు యాజమాన్యాలకు ఫీజులు, ర్యాంకులు తప్పా విద్యార్థుల ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగాధర్, శశి, ముని, గణేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిరసన



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఆధార్‌కార్డులోని తప్పులను సరి చేసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పలువురు తెలిపారు. శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద పలువురు తక్షణం ఆధార కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆధార్ కేంద్రం లేకపోవడం వల్ల కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి శ్రీకాళహస్తిలోని ఆధార్ కేంద్రాల వద్దకు పోవాల్సి వస్తుందని వాపోయారు.

అక్కడ తాము చాలా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామ సచివాలయం వద్ద ఆధార్ సేవలను అందించారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రం ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మొక్కను నాటుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని పల్లం ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా రెండు వాలీబాల్ గ్రౌండ్స్, లాంగ్ జంప్ ఫిట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఐఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధునిక పరికరాలతో పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ నెట్, బాల్స్ పాఠశాలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలను నాటాలని సూచించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్, ఐఐటీ ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారులు ఎస్‌కే చైతన్య, జీవీ సుబ్బారెడ్డి, వెంకటరమణ, మహేష్, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



బీఎన్‌కండ్రిగ, కల్లివెట్టు గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా, ఎస్వీయూ బాలుర డిగ్రీ కళాశాలలో అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్స్ బి.రాజశేఖర్, ఎం.శ్రీలత మాట్లాడుతూ గురజాడ కవితా వైభవం, రచనలు, సంఘ సంస్కరణలు అమోఘం అన్నారు. ఆనాటి సమాజంలోని దురాచారాలు ముఖ్యంగా కన్యాశుల్కం గురించి వివరించారు. ఆయన బాట ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ, పాత వీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో రీచ్‌గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుజాతికి వెలుగుజాడ గురజాడ

బుచ్చినాయుడుకండ్రిగ: అభ్యుదయ కవితా పితామహులు, తెలుగుజాతికి వెలుగుజాడ గురజాడ అప్పారావు అని అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు యువశ్రీమురళి కొనియాడారు. శనివారం మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం రూపేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

విద్యుత్ షాక్‌తో రైల్వే ఉద్యోగి మృతి



జ్ఞాన భరత్ మృతదేహం

రేణిగుంట: పట్టణంలోని పాత చెక్‌పోస్ట్ సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ రైల్వే ఉద్యోగి శనివారం మృతి చెందాడు. రేణిగుంట పోలీసుల కథనం మేరకు... రేణిగుంట మండలం గురవరాజుపల్లె పంచాయతీ రామకృష్ణాపురానికి చెందిన ముత్యాలయ్య కుమారుడు గండికోట జ్ఞానభరత్(25) రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నారు. రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూ అతని తండ్రి ముత్యాలయ్య మృతి చెందడంతో 2022లో అతనికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి రేణిగుంట రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటూ ఉద్యోగం చేస్తున్నాడు. మృతునికి వివాహం కాలేదు. ఈ క్రమంలో శనివారం తాను నివాసముంటున్న క్వార్టర్స్‌లో ఎలక్ట్రికల్ మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై పక్కనున్న మురుగునీటి కాల్వలో పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం రేణిగుంట రైల్వే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న రేణిగుంట ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.